క్లుప్తంగా

3 నుంచి రెవెన్యూ సదస్సులు

మరికల్: భూ భారతి చట్టం అమలులో భాగంగా ఈ నెల 3 నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ సుధాకార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న వెంకటాపూర్, ఎక్లాస్‌పూర్ 4న తీలేర్, జిన్నారం 5న ఇబ్రహీంపట్నం, కన్మనూర్ 6న రాకొండ, పస్పుల 9న ఎలిగండ్ల, పూసల్‌పహాడ్ 10న మాధవరం, చిత్తనూర్ 11న పెద్ద చింతకుంట, 12న మరికల్‌లో సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకుగాను అధికారులను కూడా కేటాయించామన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బిల్లులు లేకుండా విత్తనాలు కొనొద్దు

కొత్తపల్లి: పంటల సాగు చేపట్టడంతో విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలరు వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. గ్రామాలలో రాత్రి వేళల్లో వచ్చి విక్రయించే విక్రయదారుల నుంచి ఎట్టి పరిస్థితిల్లో కొనుగోలు చేయొద్దని సూచించారు. బీజీ-3 పేరుతో చలామణీ అవుతున్న హెచ్‌టీ పత్తి విత్తనాలు జీఈఏ కమిటీ అనుమతులు లేనందున ఈ రకం విత్తనాలు కొనడం, అమ్మడం, సాగు చేయడం నేరమన్నారు. అలాగే విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని రసీదు ఇవ్వకపోతే కొనగోలు చేయొద్దన్నారు. రసీదు ఉంటే పంట సరిగా రాకపోతే దుకాణదారుడి నుంచి నష్టపరిహారం రాబట్టవచ్చని సూచించారు.

ప్రజలందరూ కలిసిమెలసి జీవించాలి



మరికల్: ప్రజలందరూ కుల వివక్ష లేకుండా కలిసి మెలసి జీవించాలని ఆర్ఐ సుధాకార్ రెడ్డి, శిక్షణ ఎస్ఐ శివశంకర్ సూచించారు. పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని జిన్నారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ టీ స్టాల్, హోటళ్ల దగర రెండు గ్లాసుల పద్ధతి లేకుండా ఉండాలన్నారు. బేదాభిప్రాయాలు లేకుండా అందరు ఆలయ ప్రవేశం చేయాలన్నారు. అలాగే బాల్య వివాహాలను అరికట్టిందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది మురళీధర్ గౌడ్, భాస్కర్, శ్రీనివాస్, బాలయ్య పాల్గొన్నారు.

సిబ్బందికి పారితోషికం చెల్లించాలి



నారాయణపేట రూరల్: ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న సిబ్బందికి పారితోషకం చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ జిల్లా శాఖ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా ప్లానింగ్ ఆఫీసర్ యోగానంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సీపీఓ వెంటనే రాష్ట్ర ప్లానింగ్ అధికారికి ఫోన్ చేసి మాట్లాడగా త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ, జిల్లా కార్యదర్శి రవికుమార్, నరసింహ, వెంకటేష్ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ఉచిత వైద్య శిబిరం

కొత్తపల్లి: మండల పరిధిలోని నిడ్జింత ఉన్నత పాఠశాలలో అనుకుల చంద్ర చక్రవర్తి జయంతిని పురస్కరించుకొని సత్సంగ్ వారి ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ ఎస్వీఎస్ వైద్యశాల సహకారంతో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి విచ్చేసిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే చూపు సరిగా కనబడని 20 మందిని ఆపరేషన్‌కు రెఫర్ చేశారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాటం ప్రదీప్‌కుమార్ గౌడ్ శనివారం ఢిల్లీలో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆయన చర్చించినట్లు పేర్కొన్నారు.

కలగా కూరగాయల మార్కెట్..!

- బస్టాండ్ ఎదురుగా దుకాణాల ఏర్పాటు
- వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు



కనీస వసతులు లేని మరికల్ సంత

మరికల్: జిల్లాలో ముఖ్య పట్టణంగా ఉన్న మరికల్‌లో అభివృద్ధి ఒక అడుగు ముందుకేస్తే మూడు అడుగులు వెనక్కి పడుతున్నాయి. ఇక్కడి రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల్లో ఒకరంటే ఒకరికి గిట్టక పోవడంతో స్థానిక సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారం కావడం లేదు. నాలుగు మండల్లాలకు కేంద్ర బిందువుగా ఉన్న మరికల్‌లో కూరగాయల విక్రయాలు జరపడానికి ఇప్పటి వరకు ప్రత్యేక మార్కెట్ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో వ్యాపారస్తులు, అన్నదాతలు రోడ్లపైనే విక్రయాలు జరుపుతుండడంతో అటు వ్యాపారులు ఇటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తైబజార్ పేరుతో అధికారులు వ్యాపారుల నుంచి డబ్బులు దండుకుంటున్నా వీరి బాధలను మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో అంగట్లో అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తయారైంది మరికల్‌లో సంత పరిస్థితి.

వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి

నియోజకవర్గంలో నారాయణపేట మినహా మరికల్, ధన్వాడ, దామరగిద్ద, కోయిల్‌కొండ మండలాల్లో సంతలకు ప్రత్యేక స్థలం కేటాయించకపోవడంతో వ్యాపారులు రోడ్లపైనే వారాంతపు సంతలు నిర్వహిస్తున్నారు.దీంతో రాకపోకలకు వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. స్థానిక ప్రజలు ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వీరి గోడును ఎవరు ఆలకించడం లేదు. అంతే కాకుండా సంతలో కనీస వసతులు కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. సంతలో వ్యాపారం చేసే వ్యాపారులకు మరుగుదొడ్లు, టెట్లు, నీటి వసతి కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కానీ తమకు కనీస వసతులు కల్పించడం లేదని వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరికల్‌లో ఇరుకైన స్థలంలోనే వారాంతపు సంత నిర్వహిస్తుండడంతో జేబు దొంగలు కూడా రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంత నిర్వహణకు ప్రత్యేక స్థలం కేటాయించి వసతులు కల్పించాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

మార్కెట్ యార్డు నిర్మాణానికి తీర్మానం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరికల్‌లో బస్టాండ్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 1వ స్థలంలో మార్కెట్ యార్డు నిర్మాణం కోసం ఇటీవల గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సమావేశంలో తీర్మానం చేశారు. కానీ ఇంత వరకు ఈ విషయంపై అధికారులు ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులైనా తమ సమస్యపై దృష్టి పెట్టాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

మండల కేంద్రంలో నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు విషయం ప్రభుత్వం చేతిలో ఉంది. నిధులు మంజూరైతే అన్ని వసతులతో వారాంతపు సంతను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

– కొండన్న, ఎంపీడీఓ

ఇబ్బందులు పడుతున్నాం



సంతలో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇతర గ్రామాల నుంచి వచ్చిన వ్యాపారులకు కనీసం మరుగుదొడ్లు, టెంట్లు, నీటి వసతి కల్పించకపోవడంతో రోడ్లపైనే భోజనాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిబ్బంది తైబజార్ తీసుకుంటున్నా వసతులు మాత్రం కల్పించడం లేదు. అన్ని వసతులతో కూరగాయాల మార్కెట్ నిర్మాణం చేపడితే అందరికి సౌకర్యవంతంగా ఉంటుంది.

– అనంత్‌రెడ్డి, కూరగాయల వ్యాపారి

వర్షాకాలం వస్తే చాలు నరకమే



నూతన మార్కెట్ నిర్మాణం జరగకపోవడంతో వర్షాకాలం వస్తే చాలు రోడ్డుపై విక్రయాలు జరిపే వ్యాపారులు నరక యాతన పడాల్సి వస్తుంది. వర్షాలకు తడుస్తూ వేసవిలో ఎండలను భరిస్తూ అమ్మకాలు జరపాల్సిన పరిస్థితి. ఎమ్మెల్యే స్పందించి బస్టాండ్ ఎదురుగా వెంటనే అన్ని హంగులతో నూతన కూరగాయల మార్కెట్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఎల్లప్ప, మరికల్

స్కానింగ్ సెంటర్ల లైసెన్స్ రద్దు చేస్తాం



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

కోస్గి: పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు అలాగే స్కానింగ్ సెంటర్లలలో శనివారం జిల్లా వైద్యాధికారి జయ చంద్రమోహన్ తనిఖీలు నిర్వహించారు. ఆయా ఆస్పత్రుల్లో వైద్యుల అర్హత ధృవీకరణ పత్రాలు, ఆస్పత్రుల్లో రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసూలు చేస్తున్న చార్జీలు ఇతర రికార్డులను పరిశీలించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి వైద్యసేవలు అందిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లలో రోగుల నుంచి వసూలు చేసే ధరలకు సంబంధించి ధరల పట్టిక బహిరంగంగా ప్రదర్శించాలని, నిర్ణీత ధరల కంటే ఎక్కువ వసూలు చేస్తే స్కానింగ్ సెంటర్లను రద్దు చేస్తామన్నారు. తనిఖీలలో జిల్లా ఉప వైద్యాధికారి శైలజ, డీపీఓ భిక్షపతి, ఇంచార్జి డెమో అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

షీ టీం పై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న షీ టీం బృందం

నారాయణపేట రూరల్: అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని, అలాగే అమ్మాయిల రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీ టీంలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని షీ టీం నిర్వాహకులు బాలరాజు అన్నారు. శనివారం పట్టణంలోని ఎయిడెడ్ వైదిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఎస్ఆర్ సమ్మర్ క్యాంప్‌లో బాలికలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీం సాయం పొందాలన్నారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 87126 70398కు కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో జ్యోతి, కవిత, డైరెక్టర్ శేఖర్ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ, జర్నలిస్టులు

నారాయణపేట: జర్నలిజం ఒక పవిత్రమైన వృత్తి అని, సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని నారాయణ పేట ఆర్డీఓ రాంచందర్ నాయక్ అన్నారు. తెలంగాణ జర్నలిస్టుల ఫోరం 25 వసంతాల వేడుకల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 ఆధ్వర్యంలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ సంబరాలలో ఆర్డీఓ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా రాజ్యాంగా నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జర్నలిస్టులతో కలిసి కేక్ కట్ చేశారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

మాగనూర్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీజేఎఫ్ నిర్విరామంగా కృషి చేస్తుందని సంఘం నాయకులు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో జరిగే జర్నలిస్టుల సభకు మండలం నుంచి అనేక మంది జర్నలిస్టులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఏర్పడ్డ తమ సంఘం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అవిశ్రాంతంగా పోరాటం కొనసాగిస్తుందన్నారు. బహిరంగ సభకు వెళ్లిన వారిలో రాజు, శేఖర్, రాము, శ్రీనివాసులు, శివ, శ్రీనివాసులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



23 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కోస్గి: మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 2002-03లో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. స్థానిక ఏబీకే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 23 ఏళ్ల తర్వాత కలుసుకొని ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు అలాగే ఉద్యోగాలు చేస్తున్న వారు అందరూ కలుసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యా బోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఉపాధ్యాయుడికి పదవీ విరమణ సత్కారం

కోస్గి రూరల్: తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు పదవీ విరమణ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రవి ప్రకాశ్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ క్రమంలో 1990–91లో అదే పాఠశాలలో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుడు రవి ప్రకాశ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం గురువు ఆశీస్సులు తీసుకొని వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జగన్ మోహన్‌రెడ్డి, వరప్రసాద్ , నరేందర్ ,రమేష్ , తహసీన్, నర్సింములు, అనిల్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ ఆస్పత్రిని తరలిస్తే ఆందోళన చేపడతాం’



మాట్లాడుతున్న నాగురావు నామాజీ

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని మరో చోటకు తరలిస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ హెచ్చరించారు. ప్రెస్ క్లబ్ ఆవరణలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో 60 వేల జనాభా ఉందని, రోజూ వెయ్యి మందికి పైగా రోగులు ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వస్తుంటారన్నారు. వారందరికీ అందుబాటులో ఉన్న ఆస్పత్రిని మండలంలోని అప్పక్‌పల్లి మెడికల్ కళాశాలకు తరలించడం సరికాదన్నారు. పట్టణంలోని రోగులకు ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేసి జిల్లా ఆసుపత్రిని మరో చోటికి తరలించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి పట్టణంలోనే కొనసాగించి అన్ని సదుపాయాలు కల్పించాలని, ఆల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

మైనార్టీ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట రూరల్: రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద విదేశాలలో చదువుకుంటున్న మైనారిటీ విద్యార్థులు స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎంఏ రషీద్ తెలిపారు. అమెరికా, యూకే, ఆస్ట్రియా, కెనడా, సింగపూర్, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్‌లో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలలో (1.01.2025 నుంచి 30.06.2025 వరకు) పోస్ట్ గ్రాడ్యుయేట్ లేదా పీహెచ్‌డీ చదవడానికి ప్రవేశం పొందిన విద్యార్థులు అర్హులన్నారు. జూన్ 30 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసిన హార్డ్ కాపీ, ధృవపత్రాలను జూలై 31 సాయంత్రం 5 గంటలలోపు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షలు మరియు రూ.60 వేలు వన్ వే విమాన ఛార్జీలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

14న జాతీయ లోక్ అదాలత్

ఆత్మకూర్: ఆత్మకూర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈనెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకో వాలని ఎస్సై నరేందర్ సూచించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, చీటింగ్, కోట్లాటలు, భూ తగాదాలు, భార్యాభర్తల గొడవలు, అక్రమ రవాణ, పేకాట తదితర కేసులను కక్షిదారులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:కోయిల్‌కొండ ఎక్స్ ప్రెస్ రోడ్డు నుంచి భూత్పూర్-చించోళి జాతీయ రహదారి వరకు రూ.65.50 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు, డ్రైయిన్, కాజ్‌వే పనులకు శనివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మహబూబ్‌నగర్ అభివృద్ధిలో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఘనంగా హీరో కృష్ణ జయంతి వేడుకలు

మరికల్: దివంగత సినీ హీరో కృష్ణ జయంతి వేడుకలను శనివారం ఆయన అభిమానులు మరికల్ చౌరస్తాలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బెడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభిమాన సంఘం నాయకులు బుచ్చప్ప, శేఖర్, సీమరాజు,గోపాల్, తిరుపతయ్య, శ్రీను, రాజు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలి



ఊట్కూరు: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలని ఎంపీజే జిల్లా అధ్యక్షుడు ఖాజీ హుస్సేన్ డిమాండ్ చేశారు. శనివారం హదరాబాద్‌లోని ఇంద్ర పార్క్ దగ్గర వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ఊట్కూర్ నుంచి ఎంపీజే ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు నారాయణపేట జిల్లా నలుమూలల నుంచి ఎంపీజే కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్తున్నట్లు తెలిపారు.

అసత్య వార్త ప్రచురించిన వారిపై చర్యలు తీసుకోవాలి



మద్దూరు: భూ భారతి మాడ్యూల్ ద్వారా మద్దూరు మండలంలో 208 ఎకరాల వ్యవసాయ భూములు రైతులకు తెలియకుండానే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తన పేరిటమార్చుకున్నట్లు ఓ పత్రికలో ఇటీవల అసత్య కథనం ప్రచురించారు. దీనిపై మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహా స్పందించారు. తమ నేతపై అసత్య కథనం ప్రచురించిన పత్రిక యాజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, ఆశోక్, యాసిన్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

టీయూసీఐ మహాసభలను విజయవంతం చేద్దాం



ప్రచారం నిర్వహిస్తున్న టీయూసీఐ నాయకులు

మద్దూరు: ట్రేడ్ యూనియక్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఆధ్వర్యంలో జూన్ 15, 16 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా సహాయక కార్యదర్శి ఎదిరింటి నర్సింములు కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని పర్సపూర్, పల్లెర్ల, లక్కయిపల్లి, నందిపాడ్, గ్రామాల్లో సంఘం నాయకులు కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు 4 లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తుందని, వెంటనే ఈ కోడ్స్‌ను రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాశీనాథ్, కొండ నర్సిములు, రఘు, ఎల్లప్ప, వీరప్ప, ఎల్లప్ప, వెంకటయ్య పాల్గొన్నారు.

రైతులకు అండగా మోదీ ప్రభుత్వం



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మాగనూర్: ప్రధాని మోదీ అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం 14 పంటలకు గిట్టుబాటు ధరలు అందించడంపై శనివారం ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ప్రధాని మోదీ బ్యానర్‌కు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, పార్టీ నాయకులు క్రిష్ణయ్య, నారాయణ, అశోక్ గౌడ్, మజ్జిగ సురేష్, భరత్ పాల్గొన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం.. కేసు నమోదు

కోస్గి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలిస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులపై దౌర్జన్యానికి దిగిన పలువురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు. ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి శుక్రవారం అర్ధరాత్రి వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ క్రమంలో శేఖర్‌రెడ్డి , రఘురెడ్డి ,అశోక్ , మానయ్య , కృష్ణయ్య , చింటు ఇసుక ట్రాక్టర్‌ను పోనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో వారిపై చర్యలు తీసుకోవాలని అంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పౌరహక్కులను సద్వినియోగం చేసుకోవాలి

కృష్ణా: ప్రతిపౌరుడు రాజ్యాంగం తనకు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని మండలం తహసీల్దార్ దయాకర్ రెడ్డి తెలిపారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఏఎస్ఐ సురేంద్రబాబుతో కలిసి పౌరుల హక్కుల వినియోగంపై సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి నెల చివరి వారంలో పౌర హక్కుల వినియోగంపై సమావేశం నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి మధన్‌మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మహాదేవ్, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

11న వేంకటేశ్వరస్వామి కల్యాణం



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అమరచింత: మండల కేంద్రంలోని గణేష్‌నగర్‌లో కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో జూన్ 11న లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పారుపల్లి చింతన్న, పొబ్బతి వెంకటస్వామి తెలిపారు. ఆలయ నిర్మాణం నుంచి ఇప్పటి వరకు క్రమం తప్పకుండా ఏటా స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కల్యాణ ఏర్పాట్లను తెలియచేసే కరపత్రాలను ఆలయంలో శనివారం ప్రత్యేక పూజల అనంతరం విడుదల చేశారు. పట్టణ ప్రజలు స్వామివారి కల్యాణ వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్, వగ్గు రామలింగం, రమేష్ పాల్గొన్నారు.